

వైఎస్ఆర్

నిర్బంధం తగదు : యుటిఎఫ్

ప్రజాశక్తి కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారం కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించతలపెట్టిన ధర్నాకు బయలుదేరుతున్న ఉపాధ్యాయులను నిర్బంధించడం తగదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు పేర్కొన్నారు. విజయవాడలోని పోలీస్‌స్టేషన్ ఎదుట బుధ వారం నిరసన తెలియజేశారు. సమస్యలు పరిష్కరించమని అడిగితే నిర్బంధాలకు గురిచేయడం ఈ ప్రభుత్వానికే చెల్లిందని చెప్పారు. ఉపాధ్యాయులను నిర్బంధించిన కుట్రపూరిత ఆలోచనలు మానుకుని , వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్, నాయకులు కిరణ్ కుమార్, బాబు, కిరణ్ బాబు, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

సా..గుతున్న రబీ

ఎనిమిది మండలాల్లో లోటు
7.3 మి.మీ లోటు వర్షపాతం
జిల్లాలో 46 శాతమే సాగు

రబీ సీజన్ సా..గుతోంది. జిల్లాలోని 36 మండలాల్లో నాలుగో వంతు మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. మిగిలిన 28 మండలాల్లో 25 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కావడం ఊరట కలగడం గమనార్హం. ఇటీవల మిగిలిన మూడు మండలాల్లోనే పూర్తిస్థాయి వర్షపాతం నమోదైనట్లు కనిపిస్తోంది. ఇటువంటి వర్షాభావ పరిస్థితుల్లో 46 శాతం విస్తీర్ణంలో సాగుకు నోచుకుంది. 54.98 శాతం సాగు వర్షాభావ పరిస్థితుల నీడన ఉండడం ఆందోళన కలిగిస్తోంది.



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

2022-23 రబీలో 3,77,030 ఎకరాల్లో పంటలు సాగుచేయాలనేది జిల్లా వ్యవసాయశాఖ లక్ష్యం. నవంబర్ ఒకటి నుంచి డిసెంబర్ వరకు విత్తనం వేయాల్సి ఉంది. నవంబర్‌లో నెలకొన్న వర్షపాత ఒడిదుడుకుల నేపథ్యంలో మందకొడిగా సాగుతోంది. ఇందులోభాగంగా నవంబర్ నుంచి నేటి వరకు 28 మండలాల్లో ఆశాజనకంగా వర్షపాతం నమోదు కావడంతో 1,75,170 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. మరో 2,1,875 ఎకరాల్లో పంటలు సాగుకావాల్సి ఉంది. ఈ లెక్కన సాగు తీరుతెన్నులను పరిశీలిస్తే 54.98 శాతం విస్తీర్ణంలో పంటలు సాగు కావాల్సి ఉంది.

బద్వేల్‌లో లోటు వర్షపాతం

బద్వేల్ డివిజన్‌లోని బద్వేల్, కాశినాయన, పోరుమామిళ్ల, కలసపాడు, బి.కోడూరు, పులివెందుల, కడప డివిజన్ పరిధిలోని సింహాద్రిపురం, పెండ్లిమర్రి మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. పైన పేర్కొన్న మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కావడం రబీ సీజన్‌లో పంటల సాగు మందగించింది. డిసెంబర్ నెలాఖరు వరకు నమోదు కానున్న వర్షపాతం తీరుతెన్నులు సాగు లక్ష్యాన్ని నిర్దే శించనుంది. రబీ సీజన్ సాగుదల నుంచి నేటి వరకు జిల్లా వ్యాప్తంగా మైనస్ 7.3 శాతం లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా సానుకూల, లోటు వంటి మిశ్రమ వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో రబీ సీజన్ సాగు లక్ష్యాన్ని చేరుకోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

సిరి ధాన్యాల సాగు లేనట్లే!

జిల్లాలో సాగవుతున్న 30 రకాల పంటల్లో సిరిధాన్యాలు సాగు ప్రశ్నార్థకంగా మారింది. కొర్రలు, అరికెలు, సోమలు, వరిగ, ఊదలు వంటి సిరిధాన్యాల సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో సాగుకు అవకాశమే లేకుండా పోయినట్లు తెలుస్తోంది. వీటిని మినహాయిస్తేజిల్లాలోని ప్రధాన ఆహార పంటలైన వరి 27,795 ఎకరాలు, బుడ్డశనగ 2,47,035 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 1,43, 552 ఎకరాల్లో, జొన్న 24,610 ఎకరాలు, వేరుశనగ 20,630 ఎకరాలు, మినుములు 15,925 ఎకరాల్లో సాధారణ సాగు లక్ష్యాన్ని చేరుకో వాల్సి ఉంది. మినుములు 17,522 ఎకరాల్లో విత్తనం పడినట్లు తెలుస్తోంది. మినుములు సాగు లక్ష్యాన్ని అధిగమించడం ఊరట కలిగిస్తోంది.

రబీ లక్ష్యాన్ని అధిగమిస్తాం

రబీ సాగు లక్ష్యాన్ని అధిగమిస్తాం. నేటికి 46 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. మిగిలిన 54 శాతంలో పంటల సాగు కావాల్సి ఉంది. డిసెంబర్ నెలాఖరు నాటికి నిర్దేశిత లక్ష్యాన్ని సునాయాసంగా అధిగ మిస్తామని ధీమాను వ్యక్తం చేయడం గమనార్హం.

- నాగేశ్వరరావు, అగ్రికల్చర్ జెడి. కడప.

ముస్లిమ్ మైనార్టీలను ఓటు బ్యాంకుగా చూడొద్దు

జనవరిలో రాష్ట్ర మహాసభలు
ఆవాజ్ జిల్లా మహాసభలో రాష్ట్ర కన్వీనర్ చిష్టి

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లిమ్ మైనార్టీలను కేవలం ఓటుబ్యాంక్‌గా చూడవద్దని ఆవాజ్ రాష్ట్ర కన్వీనర్ ఎం.ఎ.చిష్టి అన్నారు. బుధవారం నగరంలోని షహీదే ఆజామ్ అష్ఫాఖుల్లాఖాన్ ప్రాంగణం (యుటిఎఫ్ భవన్)లో ఆవాజ్ జిల్లా 4వ మహాసభ నిర్వహించారు. మాజీ జిల్లా కార్యదర్శి ఖాదర్‌హుసేన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి చిష్టి మాట్లాడుతూ మైనార్టీల హక్కుల కోసం ఆవాజ్ పోరాడుతుందని పేర్కొన్నారు. సచార్, రంగనాథ కమిటీ రిపోర్టు ప్రకారం ముస్లిములు ఎస్‌సి, ఎస్‌టిలకంటే దుర్భరమైన జీవితాలు గడుతున్నారని చెప్పారు. దేశంలో మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని తెలిపారు. ఏమీ తినాలో, ఏమీ మాట్లాడాలో, ఏ దస్తులు ధరించాలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చెబుతుందని విమర్శించారు. ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్, సిఎఎ తీసుకువచ్చి ముస్లిములను ద్వితీయ పౌరులను చేయాలని చూస్తుందని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా మైనార్టీలపై దాడులు పెరిపోయాయని తెలిపారు. వీరికి ఆవాజ్ అండగా ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల నిధులను దారిమళ్లించిందని విమర్శించారు. దుల్హన్ పథకానికి చదువుతో ముడిపెట్టారని, రంజాన్ తోఫా లేకుండా పోయిందని పేర్కొన్నారు. బిజెపి మైనార్టీలపై పెద్దఎత్తున దాడి చేస్తుంటే వైసిపి, టిడిపి నాయకత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులను మత సామరస్యంతో ఎదుర్కొంటామని చెప్పారు. ఓటు కోసం నాయకులు వస్తే ఎన్ఆర్‌సిపై ప్రశ్నించాలని చెప్పారు. వామపక్షాలు బలంగా ఉంటేనే ముస్లిములకు ప్రశ్నించే హక్కు ఉంటుందని పేర్కొన్నారు. జనవరి 8,9 తేదీల్లో గుంటూరులో ఆవాజ్ రాష్ట్ర మహాసభలు ఉంటాయని తెలిపారు. జిల్లా నుంచి ప్రతినిధులు హాజరు కావాలని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ చిష్టి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రపంచ జనాభా 800 కోట్లు ఉందని తెలిపారు. ఇందులో క్రియన్, ముస్లిం మతాలకు చెందిన వారు ఎక్కువగా ఉన్నారని చెప్పారు. మనం అందరితో కలిసి జీవించాలన్నారు. రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని పేర్కొన్నారు. ఇజ్రాయిల్‌తో మోడి స్నేహమంటే కొరివితో తల గోక్కోవడమే అన్నారు. ఆవాజ్ నాయకులు ముస్లిం మైనార్టీ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పఠాన్ చాంద్‌బాష, కార్యదర్శి షేక్.ఫారూక్ హుస్సేన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, వివిధ నియోజకవర్గ మండలాల నాయకులు పాల్గొన్నారు. **నూతన కమిటీ ఎన్నిక** ఆవాజ్ జిల్లా నూతన కమిటీ 17 మందితో ఎన్నుకున్నారు. జిల్లా గౌర వాధ్యక్షులుగా ఎస్.మహమ్మద్ గౌస్, అధ్యక్షులుగా పి.చాంద్‌బాష, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఫారూఖ్ హుసేన్, ఉపాధ్యక్షులుగా ఎస్.ఎ.సత్తార్, ఎస్.ఖాదర్ బాష, సహాయ కార్యదర్శిగా ఎస్.షరీఫ్, ఎస్.మాబుతార, కె. మహబూబ్‌బాష, కోశాధికారిగా ఎస్.ఖాదర్‌బాష, జిల్లా కమిటీ సభ్యులుగా ఎస్.అన్వర్‌బాష, ఎస్.మస్తాన్, ఎస్.మహబూబ్ బాష, ఎస్.బడేపీరా, ఎస్.గౌస్‌పీర్, జి.మౌలాలి, ఎస్.షాకీర్‌ను ఎన్నుకున్నారు.

ఐసిడిఎస్ పరిరక్షణ కోసం ఉద్యమాలు

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న బి. లక్ష్మీదేవి

ఐసిడిఎస్ పరిరక్షణ కోసం ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి పేర్కొన్నారు. బుధవారం ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూ నియన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పదవ రాష్ట్ర మహాసభలు గుంటూరు నగరంలో మూడు రోజులపాటు నిర్వహించారని తెలిపారు. ఈ మహాసభలలో పలు తీర్మానాలు చేశారని పేర్కొన్నారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్లో నిధులు తగ్గించి నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ ప్రయివేట్ స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. ఐదు లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోవిడ్ కాలంలో విధి నిర్వహణలో మరణించిన అంగన్వాడీ కుటుంబాలకు రూ. 50 లక్షల బీమా వర్తింపచేయాలని చెప్పారు. అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. మహాసభలలో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నుకున్నారని చెప్పారు. కడప నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా బి.లక్ష్మీదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఆర్. లక్ష్మీదేవి, ఆదిలమ్మ ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా నాయకురాలు ఎంపి అంజనాదేవి పాల్గొన్నారు.



కొవ్వొత్తుతో నిరసన తెలియజేస్తున్న జెవివి నాయకులు

'చాగంటి'కి గురుజాడ పురస్కారం సరికాదు

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రవచనాలు చెప్పే చాగంటికి గురజాడ అప్పారావు అవార్డు ఇవ్వడం సరికాదని జెవివి రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్, రాష్ట్ర కమిటీ సభ్యులు దేవదత్తం అన్నారు. బుధవారం జెవివి ఆధ్వర్యంలో నగరంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సర్కిల్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యుదయ భావజాలం కలిగిన కవి పేరు స్థాపించిన అవార్డును చాగంటికి ఇవ్వడం సముచితం కాదని పేర్కొన్నారు. గురజాడ అడుగుజాడల్లో ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్తున్న వారికి ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.కె.సరస్వతి, జిల్లా ఉపాధ్యక్షులు బాబు, వెంకటసుబ్బయ్య,ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సమతా కన్వీనర్ పద్మావతి, జిల్లా కార్యదర్శి సునీత, కార్యదర్శి ఐయ్యావారు రెడ్డి, కోశాధి కారి సమీర్‌బాష, నగర ఉపాధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, విద్యా కమిటీ కన్వీనర్ ఆరోగ్యమేరి, కార్యకర్తలు రామేశ్వరమ్మ, మధు,రామమోహన్ పాల్గొన్నారు.

సైన్స్‌తోనే దేశాభివృద్ధి

ప్రజాశక్తి - కడప అర్బన్



బహుమతి అందుకుంటున్న అట్లూరు విద్యార్థి

దేశానికి అవసరమైన భావి శాస్త్ర వేత్తలను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని బాలల సైన్స్ కాంగ్రెస్ రాష్ట్రస్థాయి జ్యూరీ సభ్యులు గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి కృష్ణారెడ్డి అన్నారు. బుధ వారం స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఘనంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి(అప్ కాస్ట్) జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 124 ప్రాజెక్టులు విద్యార్థులు ప్రదర్శించారు. వీటి నుంచి ఏడు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ సెల్ అధికారి ఎస్ .ఎం .రెహ మాన్, రాష్ట్రస్థాయి రిసోర్స్ పర్సన్ గునిశెట్టి శ్రీనివాసులు, అకడమిక్ సమన్వ యకర్త ఆర్ శ్రీనివాసులురెడ్డి, జ్యూరీ సభ్యులుగా డాక్టర్ రామచంద్ర పాఠశాల ప్రధా నోపాధ్యాయులు నాగమణి బాల శాస్త్ర వేత్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **అట్లూరు విద్యార్థి ప్రతిభ** సైన్సు కాంగ్రెస్‌లో అట్లూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థి జస్వంత్ ప్రతిభను చాటారు. 'జీవనశైలిలో వ్యాధుల నివారణ- సాంప్రదా యక ఆహారం పాత్ర' అనే అంశంపై రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి- కడప

నివారణ తప్ప చికిత్స లేని వ్యాధి ఎయిడ్స్ అని, యువత ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం . రమేష్ సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్స వాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఎయిడ్స్ పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైస్ ప్రిన్సిపల్ మాట్లా డుతూ ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో ఎయిడ్స్ వ్యాధి ముఖ్య మైందన్నారు. యువత ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచిం చారు. అనంతరం విద్యార్థులకు 'ఎయిడ్స్ నియంత్రణలో యువత పాత్ర' అనే అంశంపై వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పి. శివరామకృష్ణ, డాక్టర్ ఏ. నాగరాజు, డాక్టర్ వై సావిత్రి, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కాశినాయన మండల సమావేశం

కాశినాయన : మండల సర్వ సభ్య సమావేశం గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ముజఫర్‌రహీం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ఎంపిటిసి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొంటారని, అన్ని శాఖల అధికారులు తమ డిపార్ట్‌మెంట్ రిపోర్టును తీసుకుని హాజరు కావాలని తెలిపారు.

ప్రశాంత జీవనం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- కాశినాయన

ప్రజలు ప్రశాంత జీవనం కోసం పాటుపడాలని ఎస్ఐ రమణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి గొడవలకు పోకుండా ప్రజలందరూ ప్రశాంతంగా ఉండాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలను నివారించాలన్నారు. కుల, మతాలకు అతీతంగా ఐక్యంగా పండుగలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సుధీర్, జమాల్, ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి-గోపవరం

మండలంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజు పేర్కొన్నారు. బుధవారం మండల సర్వ సభ్య సమావేశం ఎంపిపి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడూ పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశానికి కొన్ని శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన పనుల వివరాలు ఆమె వివరించారు. ఎంపిటిసి రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సమస్యలు చాలా ఉన్నాయని, ఆశాఖ అధికారి రాకపోతే ఎలా అని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ హరి నారాయణ, ఐసిడిఎస్, ఇరిగేషన్ అధికారులు, జడ్‌పిటిసి జయరాములు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ముఖ్యం : జడ్జి

ప్రజాశక్తి - వల్లూరు/కడప



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన అవసరమని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థినిలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ పిల్లలకు చదువుకునే సమయంలోనే చట్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. విద్యాహక్కు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల నేరస్తులు వంటి చట్టాలపై ఆమె అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరుగుతున్నప్పుడు 1098 కు సమాచారం ఇవ్వాలన్నారు. లోక్ అదాలత్ వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థినిలకు వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ వారి దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మూర్తి సురేష్ బాబు, విద్యార్థినిలు పాల్గొన్నారు. **విద్యార్థులకు బహుమతులు అందజేత..** రాజ్యాంగ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, యాదాల రంగమ్మ జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం


చెన్నూరు : మండలంలోని ఓబులంపల్లెలోని లక్ష్మీనారాయణ ఆస్పత్రిలో ముండ్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 2న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. వైద్య శిబిరంలో బద్వేల్ పట్టణానికి చెందిన కీ.శే. బిజీ వేముల వీరారెడ్డి సాటిపుల్ ట్రస్ట్ కంటి వైద్యులు డాక్టర్ రవి కుమార్ రెడ్డి, డాక్టర్ పంకజనాభ, డాక్టర్ ప్రదీప్ కుమార్, డాక్టర్ శాంతి, వైద్య సిబ్బంది పాల్గొని పరీక్షలు చేస్తారన్నారు. మండల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలూ వైద్య శిబిరంలో పాల్గొనవచ్చని సూచించారు.

ప్రభుత్వ నిర్ణయంపై కృతజ్ఞతలు

కడప :ఉపాధ్యాయులకు బోధ నేతర పనుల నుంచి విముక్తి కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ఎస్‌ఆర్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బి. నాగేశ్వరరావు హర్షం కృతజ్ఞతలు తెలిపారు. మునిసిపాల్ పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు జీవో ఎంఎస్ నెంబర్ 180 ఇవ్వడం హర్షనీయం అన్నారు. ఎయిడెడ్ పాఠశాల కళాశాలలో పనిచేసే బోధన, బోధ నేతర సిబ్బందికి విరమణ వయసు 60 నుండి 62 సంవత్సరాలు పెంచుతూ గెజిట్ విడుదల చేయడం శుభ పరిణామం అని తెలిపారు.

జనసేన నాయకులకు సన్మానం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల



జనసేన నాయకులను సన్మానిస్తున్న పవన్‌కల్యాణ్ అభిమానులు

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి కావాలని చేపట్టిన పాదయాత్ర ముగించుకుని పోరుమామిళ్ల పట్టణానికి చేరుకున్న జనసేన మండల శీలంశెట్టి లక్ష్మయ్య, కోటపాటి వెంకటేష్, నరసింహను గురువారం పవన్ అభిమానులు శాలువా పూలదండలతో సన్మానించారు. ఈనెల 24న పోరుమామిళ్ల నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా శీలంశెట్టి లక్ష్మయ్య మాట్లాడుతూ పాదయాత్రలో అభిమానులు సంఘీభావం తెలియజేశారన్నారు. కార్యక్రమంలో పవన్ అభిమానులు శ్రీకాంత్, ప్రసాద్, డాక్టర్ జయరామయ్య, ప్రసాద్, మహేష్, నారాయణ, సుదర్శన్, ఇమ్రాన్, శ్రీకాంత్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

మహిళల అభివద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - కడప అర్బన్

మహిళలు తమ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సిఎంఎం హరిప్రసాద్‌రెడ్డి, సిఒ ప్రద్యుమ్న సూచించారు. బుధవారం నగరంలోని బిసి భవన్‌లో డ్వాక్రా మహిళల వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఆర్థిక చేయూతనందించడానికి డ్వాక్రా గ్రూపుల ద్వారా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, సభ్యులను ఆర్‌పిలు దగ్గరుండి సంక్షేమ పథకాలను వారికి వివరించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్పీలు చంద్రకళ, అమరావతి, సుగుణ, ఉమ, ఓబీలు పెద్ద ఎత్తున డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ ప్రముఖ వైద్యులు, సన్మానం పొందుతున్న డాక్టర్ నగేష్ దంపతులు

విశిష్ట సేవలందించిన డాక్టర్ నగేష్

ప్రజాశక్తి-కడప సిటీ

ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఆర్థో విభాగాధిపతి డాక్టర్ జె. నగేష్ విశిష్టసేవలందించారని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రి సమావేశ హాలులో ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వెంకట్రాముడు అధ్యక్షతన డాక్టర్ నగేష్ ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, రిమ్స్ సూపరిటెంటెండ్ డాక్టర్ వెంకటేశ్వర్లు హాజయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చిన రోగులకు తనదైన శైలిలో చికిత్స అందించారన్నారు. రోగులతో పాటు వైద్య విద్యార్థులు, సహచర వైద్యులతో స్నేహ పూర్వకంగా మెలిగేవారని చెప్పారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల సుదీర్ఘ వైద్య సర్వీసులో రోగులకు సేవలు అందించారన్నారు. అనంతరం డాక్టర్ నగేష్ మాట్లాడుతూ తన వృత్తి జీవితంలో ప్రజలకు సూపర్ స్పెషాల్టీ వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉందని చెప్పారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన వారి కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, ప్రెసిడెంట్ డాక్టర్ సురేశ్వర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ డాక్టర్ వెంకట శివ, ఆర్థో డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రామమనోహర్, ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ ఫరూక్, కార్యదర్శి డాక్టర్ వినయ్, డాక్టర్ యతీరాజ్, ఏ-1శానిటేషన్ కాంట్రాక్టర్ బలనాగిరెడ్డి, సర్వజనాస్పత్రి అన్ని డిపార్ట్మెంట్స్ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సేవకు మారు పేరు జెకె యూత్

ప్రజాశక్తి-కడప అర్బన్

సేవకు మారు పేరు జెకె యూత్ అధ్యక్షులు ఖాదర్‌బాష అని వైసిపి రాష్ట్ర కార్యదర్శి పఠాన్ అఫ్జల్ ఖాన్ అన్నారు. బుధవారం జెకె యూత్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అఫ్జల్ ఖాన్ మాట్లాడుతూ మెకానిక్‌గా ఉంటూ వచ్చిన సంపాదనలో కొంత భాగం పేదవారికి ఖర్చు చేయడం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి వారు అరుదుగా ఉంటారని చెప్పారు. స్పందించిన ఖాదర్‌బాష మాట్లాడుతూ తన సేవను గుర్తించి సన్మానం చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు వహీద్, అబ్బాస్, జాకీర్ పాల్గొన్నారు.

యువత ఎయిడ్స్ బారిన పడొద్దు

ప్రజాశక్తి-కడప అర్బన్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అమీర్‌బాబు, సలావుద్దీన్

విద్యార్థులు, యువత ఎయిడ్స్ బారిన పడొద్దని సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, టిడిపి కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వి.ఎస్. అమీర్‌బాబు పిలుపు నిచ్చారు. బుధవారం అమీర్‌బాబు స్వగృ హంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పుస్క రించుకుని రాయల్ రషీద్ అసోసియేషన్ ముద్రించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎయిడ్స్ వ్యాధి అంటే ఎంతో భయపడేవారి పేర్కొన్నారు. ప్రస్తుతం ఎ రూపు మాపేందుకు మందులు తయారు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్. ఆర్.సంస్థ అధ్యక్షులు రాయల్ కరీముల్లా, రషీద్, డిసిసి మాజీ అధ్యక్షులు నజీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

హమాలీలకు కూలి రేటు పెంచాలి

కడప అర్బన్ : రాష్ట్రంలో ఉన్న 29 బేవరేజ్ డిపోలలో పని చేస్తున్న హమాలీలకు ఎగుమతి కూలి రేటు పెంచాలని హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి.సుబ్బారెడ్డి కోరారు. బుధవారం కడప ఐఎంఎల్ గోడౌన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న కూలి రేటు 2021, అక్టోబర్ 31తో ముగిసిందని పేర్కొన్నారు. పలుమార్లు ఎపిఎస్‌బిసిఎల్ ఎండి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ, సిగ్మా సంస్థ అధికారులకు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకవెళ్లామని చెప్పారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కూలి రేటు రూ.7 నుంచి రూ.10కి పెంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు కె.రఘురామ్య, ప్రతినిధులు ఆర్.సుబ్బరాయుడు, ఎల్.మనోహర్‌రెడ్డి, జి.రెడ్డి ప్రసాద్, సుబ్బారెడ్డి, నరేష్, కొండారెడ్డి, భరత్, వేణు, హమాలీలు పాల్గొన్నారు.

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

కడప అర్బన్ : జిల్లాలోని లంకమల్ల అటవీ ప్రాంతంలోని బి.మఠం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎర్రచందనం స్మగ్లర్లపై పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురిని అరెస్టు చేశారని ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 దుంగలు స్వాధీనం చేసుకున్నారని పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో శివన్ బాబు, కామరాజు, కనకరాజు ఉన్నారని చెప్పారు. వీరి వద్ద నుంచి ఎర్రచందన దుంగలతో పాటు సెల్ ఫోన్, 3 గొడ్డళ్లు, 3 రాళ్లు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఫ్యాక్షన్ జోన్ డిఎస్‌పి చెంచుబాబు, మైదుకూరు డిఎస్‌పి వంశీధర్‌గౌడ్, టాస్క్ ఫోర్స్ సిఐ నాగభూషణ్, ఆర్ఎస్ఐ పోతురాజు, కె.నారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, ఎస్ఐ కుళాయప్ప, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

ఉద్యోగాల సంఖ్య పెంచాలి : డివైఎఫ్ఐ

కడప అర్బన్ : ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల సంఖ్యను పెంచాలని, అభ్యర్థుల వయోపరిమితి, పరీక్ష సమయం, గడువు పెంచాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. బుధవారం డివైఎఫ్ఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి సంవత్సరమూ 6,700 ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ 20,100 పోస్టు విడుదల చేయాల్సి ఉండగా మాట తప్పారని పేర్కొన్నారు. మాట ప్రకారం 6,500 నుంచి 21 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఐదు సంవత్సరాల నుంచి నోటిఫికేషన్లు లేకపోవడంతో లక్షలాదిమంది డిగ్రీలు, పీజీలు చదువుకుని ఏళ్ల తరబడి శిక్షణ తీసుకుంటున్న వారు నష్టపోతున్నారని చెప్పారు. తక్షణమే హామీలు నెరవేర్చాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు అందరూ ఏకమై ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాడుతామని హెచ్చరించారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు డేవిడ్‌రాజ్, నగర అధ్యక్షులు, కార్యదర్శులు షాకీర్, డి.ఎం.ఓబులేసు పాల్గొన్నారు.

బిసిలకు పెద్దపీట : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బిసిలకు పెద్దపీట వేస్తున్నారని డిప్యూటీ సిఎం అంజాద్ బాష అన్నారు. బుధవారం కడప మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. చైర్మన్‌గా బంగారు గంగాదేవి, వైస్ చైర్మన్ సయ్యద్ ఇబ్రహీంమియా, డైరెక్టర్లుగా బంగారు నాగయ్య, రామకృష్ణ, సంపత్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మైదుకూరు ఎంఎల్ఎ రఘురామిరెడ్డి, మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న మార్కెట్ యార్డు నూతన కార్యవర్గం

సిఎం భద్రత ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

శుక్ర, శనివారాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల, లింగాల మండలం పార్నపల్లె, ఇడుపులపాయ పర్యటిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ విజయ్ రామరాజు, ఎస్‌పి అన్బు రాజన్ బుధవారం భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈనెల 3న సిఎం వ్యక్తిగత కార్యదర్శి రవిశేఖర్ కుమార్తె వివాహ నిమిత్తం సిఎం జగన్ ఎస్‌సిఎస్‌ఆర్ ఫంక్షన్ హాలుకు రానున్నారు. ఈ సందర్భంగా అక్కడ భద్రత ఏర్పాట్లను ఎలా చేయాలని అధికారులకు వివరించారు. అనంతరం వారు లింగాల మండలం పార్నపల్లెకు వెళ్లారు. అంతకుముందు భాకరాపురం వద్ద ఉన్న హెలిప్యాడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, పులివెందుల డిఎస్‌పి శ్రీనివాసులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



భద్రత ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

జిఒ 53ను రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మెడ్యాల్ కులాలకు అన్యాయం జరిగే జిఒ 53ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఆ మేరకు బుధవారం ఆయన మాదిగ దళిత సంఘాల తరఫున పాడా కార్యాలయంలో ఎఒ ప్రభాకర్‌రెడ్డికి వినతి పత్రమిచ్చారు. ఏపి ప్రభుత్వం బోయ వాల్మీ కులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని ఆదేశించడం తగదన్నారు. మెడ్యాల్ కులాల జాబితాలో ఒక కులాన్ని తీసివేయాలన్నా, ఇంకో కులాన్ని చేర్చాలన్నా రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే జిఒ 53ను రద్దు చేయాలన్నారు.

ఐఓటి సమాజానికి ఉపయోగం

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక సిబిఐటి కళాశాలలో బుధవారం ఇంజినీరింగ్ ఐసిఇ విద్యార్థులకు 'ఆర్డినో' టివి ప్రోగ్రామింగ్ ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ డీన్ డాక్టర్ కె.వెంకట రమణయ్య మాట్లాడుతూ ఐఓటి ప్రస్తుత సమాజానికి, భవిష్యత్తులో ఎంతో కీలక పాత్ర పోషించనుందన్నారు. ఐఓటి ఐఇఎస్ఇటి ఐఒఎస్ ప్రవర్తన చెందుతుందన్నారు. ఒక వస్తువు తన ఇంటి వద్దే తన కంపెనీ నియంత్రించే పనులను పర్యవేక్షించే సౌలభ్యం ఈ ఐఓటితో సాధ్యమవుతుందని వివరించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు ఐఓటి నాలెడ్జ్‌ని పెంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వైర్‌లెస్ ద్వారా టెక్నాలజీని ఎలా తయారు చేయాలి, మొబైల్ టెక్నాలజీ ఉపయోగాలు తదితర అంశాలను వివరించారు. అనంతరం ఐఓటి ల్యాబ్‌లో ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్ సందర్భంలో విద్యార్థులకు తన సందేశాలను, సలహాలను అందించారు. అనంతరం కళాశాల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, హెచ్‌ఒడి లక్ష్మీకిరణ్ మాట్లాడుతూ తమ విద్యార్థులకు ఎన్నో అమూల్యమైన విషయాలను తెలియజేసినందుకు హర్షం వ్యక్తం చేశారు.

క్రీడా పోటీల్లో 'బీరం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు మేధా డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఎస్‌జిఎఫ్ నిర్వహించిన జిల్లాస్థాయి త్రోబాల్ అండర్-19 బాలుర, బాలికల విభాగంలో బీరం పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పదవ తరగతి విద్యార్థులు బి.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, బి.నాని కుమార్‌రెడ్డి, 9వ తరగతి చదువుతున్న ని.గంగిరెడ్డి, ఎ.దినేష్‌రెడ్డి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం (ఎంపిసి) ఎల్.వంశీకృష్ణ, కె.ఉమామహేశ్వర్, ఇంటర్ విద్యార్థులు బి.దేవీహర్షిత, బి.కావ్య, ఎం.భవ్య, జి.భాను సుదీప్తి, డి.సాయి మహతి, వి.సాత్విక, బి.వెంకట భార్గవి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్-19 వాలీబాల్ విభాగంలో ఇంటర్మీడియట్ చదువుతున్న బి.సుబ్బరాయుడు (బైపిసి), ఎం.గురుప్రదీప్ (ఎంపిసి), ఎం.గ్లోరీ(బైపిసి), వై.గ్రీష్మరెడ్డి (ఎంపిసి), పదవ తరగతి చదువుతున్న ఎం.తన్మయి రాష్ట్రస్థాయిలో రాణించనున్నారు. టెన్నికాయిట్ అండర్-19 బాలుర, బాలికల విభాగంలో ఇంటర్ (ఎంపిసి) ఇ.హేమంత్‌రెడ్డి, బి.ఈశ్వర్ రెడ్డి, వి.యశ్వంత్‌రెడ్డి, ఎంకె విష్ణువర్ధన్ రెడ్డి, కె.కీర్తి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వరుస విజయాలను పురస్కరించుకొని స్కూల్ అధినేత బీరం సుబ్బారెడ్డి, చైర్ పర్సన్ సరస్వతమ్మ హర్షం వ్యక్తం చేశారు. విజేతలను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, ప్రిన్సిపల్ శ్వేత, కాలేజి ప్రిన్సిపల్ భాస్కర్‌రెడ్డి వ్యాయామ ఉపాధ్యాయులు ఎ.సురేష్ బాబు, బి.చిన్నయ్య, అంజి, కె.సాయిజ్యోతి, బి.త్రివేణి పాల్గొన్నారు.

మైదుకూరు : రెండు రోజుల నుండి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మేధా డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల బాల బాలికలకు అండర్-19 వాలీబాల్. త్రోబాల్, బాల్ బ్యాడ్మెంటన్. టెన్నికాయిట్, అథ్లెటిక్స్ మొదలగు అంశాలలో క్రీడా ఎంపికలు నిర్వహించారు. ఇందులో మేధా డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు తమ సత్తాను చాటి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిలో ఎస్ సింహాద్రి. పి మహమ్మద్ రఫి, కె కాశీవిశ్వనాథరెడ్డి. ఎ.ప్రకాష్ యాదవ్. డి.సూర్య అరుణ్‌కుమార్ రెడ్డి. పి అబ్దుల్ ఆనిఫ్. జె.మురళి. ఎన్.ముక్తార్, డి సంజయ్ దిలీప్. ఎం సుధీర్, పి మహారాజ్. జివి పవన్‌కళ్యాణ్. యు సాయిప్రవల్లిక, యు సంధ్యారాణి. సి యక్షిత. బిఎస్ భావిద, జి పవన్‌కుమార్‌రెడ్డి. ఉన్నారు. మేధా విద్యాసంస్థల చైర్మన్ చెన్నం శెట్టి నరసింహులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

రక్షణ కల్పించకుండా తరలించడం తగదు

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్‌కుమార్

బ్రహ్మంగారిమఠం : మండలంలోని గురుకుల పాఠశాలలో వరుసగా విద్యార్థులు మృతి చెందిన ఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో జిల్లా అధికారులు విద్యార్థులకు రక్షణ కల్పించకుండా విద్యార్థులను ఇక్కడి నుంచి తరలించడం తగదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్‌కుమార్ తెలిపారు. స్థానికంగా బుధవారం ఆయన మాట్లాడుతూ వెంటనే యధావిధిగా గురుకుల కాలేజీని కొనసాగించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కలివేల రాజశేఖర్, ఎర్రంపల్లి అజయ్ పాల్గొన్నారు.

మొదటి నుంచి అడ్డుకుంటున్నాం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : వాజ్‌పేయి నగర్‌లో అక్రమదారులను మొదటి నుంచి తాము అడ్డుకుంటున్నామని ఆ స్థల యజమానులు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వాజ్‌పేయి నగర్ పేరుతో ఆక్రమించిన స్థలం 81వ ఫ్లాట్ నుండి 113 ప్లాట్ వరకు అక్రమదారులను అడ్డుకోవడం జరుగుతుందన్నారు. 20ఏళ్ల క్రితం వలసదారులుగా వచ్చి ఆక్రమించారని తెలిపారు. అడ్డుకుంటే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టారన్నారు. అప్పటి ప్రొద్దుటూరు తహాశీల్దార్ గూడూరు వెంకటసుబ్బయ్య ప్లాట్లు యజమానులవే అని నిర్ధారించి అక్కడున్న వారికి రెండు ఎకరాల స్థలం ఇచ్చి గృహ నిర్మాణ శాఖ లోన్ ఇప్పిస్తానని తెలిపారని అన్నారు. దానికి వారు ససేమిరా వెళ్ళమని చెప్పడంతో కోర్టుకెళ్లాల్సి వచ్చిందన్నారు. కోర్టు ఆదేశాలను కూడా వారు ధిక్కరించి గడువు కోరుతూ వచ్చారన్నారు. 14ఏళ్లుగా వారు ప్లాట్ యజమానులను శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అక్రమదారులు అయినదానికి కానిదానికి ఎమ్మెల్యేను దూషిస్తున్నారని తెలిపారు. ఇది ఎమ్మెల్యేకు సంబంధం లేని విషయమన్నారు. కార్యక్రమంలో స్థల యజమానులు సుబ్రహ్మణ్యం, ఓబుల్ రెడ్డి, వరదరాజులు, అమీర్ బాషా, శ్రీనివాస్ రెడ్డి, నాగరత్నమ్మ, విజయకుమార్, కామేశ్వరరావు, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని టికెఆర్ వ్యవస్థాపకులు మాస్టర్ ఆఫ్ సర్జన్ అమెరికా డాక్టర్ సదాశివారెడ్డి పేర్కొన్నారు. స్థానిక టికెఆర్ జీవన జ్యోతి హైస్కూల్‌లో బుధవారం జీవన జ్యోతి విద్యాసంస్థల అధినేత గురుదేవ్ రామిరెడ్డి ఆధ్వర్యంలో 'నాయకత్వం' అనే వినూత్న కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సదాశివారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే నాయకత్వం వహించడం అనేది ఒక మంచి లక్షణమన్నారు. గురుదేవ్ రామిరెడ్డి, పాఠశాల కరెస్పాండెంట్ అమర్‌నాథ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు డిసి గురుశేఖర్ మాట్లాడారు. ఈ సందర్భంగా నాయకత్వ లక్షణాలుగల విద్యార్థులను గుర్తించి వారికి ఓటింగ్ నిర్వహించారు. గెలుపొందిన వారికి బ్యాడ్జీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల్ని కౌన్సిల్ దృష్టికి తీసుకురండి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీలో ఏవైనా సమస్యలు ఉంటే కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకురావాలని చైర్మన్ వల్లెపు వరప్రసాద్, వైస్ చైర్మన్లు వైఎస్ మనోహర్‌రెడ్డి, హాఫీజ్ కోరారు. స్థానిక పురపాలక సభ భవనంలో బుధవారం అత్యవసర కౌన్సిలింగ్ సమావేశాన్ని కమిషనర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పురపాలక అభివృద్ధికి అటు అధికారులు, సిబ్బంది, ప్రజలు సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఇంటి, నీటి పన్నులు సకాలంలో చెల్లించాలన్నారు. అక్రమంగా నీటి కనెక్షన్ వాడుతున్న వారు వెంటనే క్రమబద్ధీకరించుకోవాలన్నారు. లేకుంటే చట్ట చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి కౌన్సిలర్ తమ వార్డులో పర్యటించాలన్నారు. సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. అనంతరం 18 అంశాలతో సమావేశం ప్రారంభమైంది. అభివృద్ధి పనులకు కౌన్సిలింగ్ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, ఎ.విజయ్‌కుమార్ నాయుడు, కొంగనపల్లి కొండలరావు, అరకటవేముల సుజాత, మూలి మహేశ్వర్‌రెడ్డి, షేక్ ఖాదర్‌బాషా,కె.సహిదా, కో-ఆప్షన్ చంద్రమౌళి, అధికారులు పాల్గొన్నారు.

46 అంశాలపై కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : పట్టణాభివృద్ధి కోసం బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నాగరాజు అనుమతితో 46 అంశాలతో కూడిన అజెండాతోపాటు నాలుగు టేబుల్ అజెండా అంశాలపై ఏకగ్రీవ తీర్మాణం చేశారు. సమావేశంలో 46వ సచివాలయ సెక్రటరీ ప్రజలతో అమర్యాదకరంగా మాట్లాడుతూ నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని గత సమావేశాల్లో కూడా ప్రస్తావనకు తెచ్చామన్నారు. కమిషనర్ వెంకట రమణయ్య స్పందిస్తూ సిబ్బంది వ్యవహారశైలిపై ఇదివరకే ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి తగు సూచనలు ఇచ్చామన్నారు. భవిష్యత్తులో కూడా తమ తీరును మార్చుకోకుండా శాఖాపరమైన చర్యలు తీసుకుం టామన్నారు. సిద్ధిక్ కాంప్లెక్స్ వైపు ఉన్న మున్సిపల్ ఖాళీ స్థలంలో స్థానికులు చెత్తా చెదారాన్ని వేస్తూ దుర్గంధ భరితంగా తయారైందన్నారు. ఆ ప్రాం తంలో చెత్తా చెదారాన్ని తొలగించి ప్రత్యేక భవనాన్ని ఏర్పాటు చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ఆర్‌పిలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ కమాల్‌బాషా కోరారు. మున్సిపల్ స్థలాలను గుర్తించి వాటిని కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో కౌన్సిలర్లు సుబ్బారెడ్డి, పిట్టా బాలాజీ, జిలాని, చరిత, గరిసెపాటి లక్ష్మీదేవి, సత్యం, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

'ఇదేమి ఖర్మ'ను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రజాశక్తి - ఖాజీపేట

వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ టిడిపి చేపట్టిన ఇదేమి ఖర్మ.. మనా రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిడిపి మైదుకూరు ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ కోరారు. స్థానిక రాజ్ థియేటర్‌లో బుధవారం ఆయన టిడిపి నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభిస్తామన్నారు. మైదుకూరు నియోజకవర్గంలో 45రోజులపాటు 50 పంచాయితీల్లో నిర్వహిస్తామన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అన్యాయాలు, అక్రమాలు ఎక్కువయ్యాయని అన్నారు. ఇసుక, మట్టి దోపిడీతో విచ్చలవిడిగా ప్రకృతి వనరులను దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ప్రతి ధర రాష్ట్రంలో పెరిగిపోయిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించేలా పార్టీ మండల అధ్యక్షులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్పి టిడిపికి పట్టం కట్టాలని, ఆ మేరకు అందరూ కష్టించి పని చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, కడప మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగ శివారెడ్డి, మైనారిటీ అగ్ర నాయకులు కమలాపురం ఫరూక్ అహ్మద్, జెండాల మహబూబ్ బాషా, కమలా పురం గౌస్, జలీల్ అహ్మద్, రామా నాయుడు, పత్తూరు రమణ, చెముళ్లపల్లె వెంకట్రామిరెడ్డి, పల్లె గంగాధర్, తుట్టే రాము యాదవ్, దాసరి శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పుట్టా సుధాకర్ యాదవ్, నాయకులు

జమ్మలమడుగు రూరల్ : తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి అనే పోస్టర్‌ను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సి.భూపేష్‌రెడ్డి ఆవిష్కరించారు. రాష్ట్రానికి పట్టిన కర్మను 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి పోగొట్టుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జంబాపురం రమణారెడ్డి, పొన్నతోట శ్రీనివాసులు, రాయల్ కిరణ్, తులసి రెడ్డి, తిరుమల కొండ, రఫీ, దాదా పీర్, భాస్కర్, శంకర్ రెడ్డి, చిన్న, నవీన్. నాగేశ్వర్ రెడ్డి. రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌భాస్కర్, సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ ఆవరణలో బుధవారం పారిశుధ్య కార్మికులతో కలిసి జమ్మలమడుగు పట్టణ మహాసభలు నిర్వహించారు. జిల్లా వర్కింగ్ ప్రెసి డెంట్ విజయ్‌కుమార్, చేనేత సంఘం జిల్లా అధ్యక్షులు శివనారాయణ ముఖ్యఅతిథులుగా మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. పోరాటాల ఫలితంగానే కార్మికుల హక్కులు సాధించుకోగలమన్నారు. భవిష్యత్తులో కార్మికులకు ఏ అన్యాయం జరిగినా పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. పట్టణ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులు నాగన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి శేఖర్, పట్టణ కోశాధికారి శివన్నతోపాటు 14 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

గురజాడ అప్పారావు నవయుగ వైతాళికుడని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు గురజాడ అప్పారావు 107వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ 'దేశమంటే మట్టి కాదోయ్.. దేశం అంటే మనుషులోయ్' అని సమాజానికి చెప్పిన గొప్ప దేశ భక్తుడు గురజాడ అప్పారావు అని కొనియాడారు. స్త్రీ జనోద్ధరణ, సంఘ సంస్కరణ, భాషోద్యమం ఈ మూడింటిని సమానంగా నడిపించిన మార్గదర్శి గురజాడ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, రామకృష్ణ, సత్తార్, చెన్నకేశవ, నరసింహారెడ్డి, బద్రి, రాఘవయ్య పాల్గొన్నారు.

సిఎం పదవికి రాజీనామా చేయాలి

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును ఎపి నుంచి తెలంగాణ రాష్ట్రానికి బదిలీ చేయడం పట్ల నైతిక విలువలు పాటించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డి రాజీనామా చేయాలని బుధవారం పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో నీలం సంజీవరెడ్డి, నేదురుపల్లి జనార్ధన్‌రెడ్డి కోర్టులు ప్రతికూల వాఖ్యలు చేసినందుకు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి నైతిక విలువలు నెలకొల్పారన్నారు. సుప్రీంకోర్టు జగన్ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు చాలా తీవ్రమైనవిగా ఆయన పేర్కొన్నారు. రాబోవు ఎన్నికల్లో ఉపాధ్యాయులు ఎన్నికల సిబ్బందిగా ఉంటే ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరుగుతాయని.. అలా అయితే వైసిపి ఓడిపోతుందని భయం సిఎంకు జగన్‌కు పట్టుకుందని తెలిపారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

- గురుకుల పాఠశాలలో ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

విద్యార్థులకు రుచికర, నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎపి ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బెస్తవారిపల్లె గ్రామ సమీపంలో ఉన్న అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజయ్ ప్రతాప్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గురుకుల పాఠశాలకు సంబంధించి వాట్సప్ ద్వారా ఫిర్యాదులు అందాయన్నారు. ఆ మేరకు తనిఖీ నిమిత్తం వచ్చామన్నారు. విద్యార్థులతో మాట్లాడినట్లు తెలిపారు. ముఖ్యంగా ఇక్కడ ప్లాస్టిక్ బియ్యం సమస్య అంటున్నారని, అవి ప్లాస్టిక్ బియ్యం కాదని రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికంగా విటమిన్ అందించే ఉద్దేశంతో వీటిని అందులో కలుపుతున్నారని తెలిపారు. ఈ బియ్యం ద్వారా బి12 విటమిన్ అందుతుందని ఆయన వివరించారు. దీని మీద అవగాహన లేకనే ప్లాస్టిక్ బియ్యం అనుకున్నారని తెలిపారు. వీటిని తినడం వల్ల ఉపయోగాలు, విటమిన్స్ మన శరీరానికి అందుతాయని పేర్కొన్నారు, పాఠశాల పరిసరాలను, వంట గదులను, బియ్యం, కూరగాయల స్టోరేజిలను పరిశీలించారు. అధికారులు డిఎం అర్జున్ రావు, డిఎస్ఒ సుబ్బారెడ్డి, లీగల్ మెట్రాలజీ రవీంద్రారెడ్డి, ప్రిన్సిపల్ బండ్లపల్లి నజిరుల్లా, రామచంద్రారెడ్డి ఉన్నారు.

బాలల హక్కులపై అవగాహన

జమ్మలమడుగు రూరల్ : బాలల హక్కులపై అవగాహన కల్పించామని న్యాయవాది పాలజీ రవికుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో బుధవారం జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్ ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు హక్కులతోపాటు బాధ్యతలు కూడా తెలుసుకోవాలన్నారు. చక్కటి విద్యను అభ్యసిస్తూ మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వివరించారు బాల్యవివాహాలు, మహిళల అక్రమ రవాణా వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటల్ ల్యాబ్ ప్రారంభం

పులివెందుల టౌన్ : స్థానిక గురుకుల పాఠశాలలో అటల్ ల్యాబ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఇఒ దేవరాజ్, జిల్లా క్రీడల అధికారి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానం సృజనాత్మక, నైపుణ్యం పెంచడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వేముల జడ్‌పిటిసి బయపురెడ్డి, స్థానిక వైసిపి నాయకులు వేల్పుల రాము, సాంబశివారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ బండ్లపల్లి నజీరుల్లా, అటల్ ఇన్‌ఛార్జి సువర్ణ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అండర్-19 జిల్లా స్థాయి పోటీలు

పులివెందుల రూరల్ : స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఎస్‌జిఎఫ్ అండర్-19 జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనడానికి అన్ని కళాశాల విద్యార్థులు వచ్చారు. కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు జెండా ఊపి ప్రారంభించారు. డిఇఒ దేవ రాజ్, జిల్లా క్రీడల అధికారి రామచంద్రారెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైసిపి నాయకులు వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, వేముల జడ్‌పిటిసి బయపరెడ్డి, నాయకులు వేల్పుల రాము, సాంబశివారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ బండ్లపల్లి నజీరుల్లా, అటల్ ఇన్‌ఛార్జి సువర్ణకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ బాలల సైన్స్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపిక


వేంపల్లె : 30వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థి ఉదయ దీప్తి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. బుధవారం రాష్ట్రస్థాయికి ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్, డైరెక్టర్ చేతన్‌రెడ్డి అభినందించారు. కడప మున్సిపల్ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి 30వ జాతీయ సైన్సు కాంగ్రెస్ పోటీల్లో ప్రతిభ చాటారు. ఉదయ దీప్తి రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా, యశ్వంత్‌రెడ్డి, లిఖిత్ యాదవ్, లిఖితారెడ్డి, గురుభావనకు కన్సోలేషన్ బహుమతులు పొందినట్లు తెలిపారు.

యూనియన్ బ్యాంకు సేవలు ప్రారంభం

ఎర్రగుంట్ల : స్థానిక వేంపల్లి రోడ్డులో యూనియన్ బ్యాంకు నూతన భవనాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ ప్రారంభించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్‌తోపాటు ముఖ్య అతిధులుగా యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ భాస్కర్‌రావు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ బ్యాంకులో వ్యవసాయ రుణాలు, విద్యా రుణాలు, బంగారు రుణాలు తక్కువ వడ్డీలకు ఇస్తున్నామన్నారు. బ్రాంచ్ మేనేజర్ నాగిరెడ్డి మాట్లాడుతూ త్వరలో ఈ బ్యాంకులో లాకర్ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. ముద్ర రుణాలు, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం కింద రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామ్మోహన్, గోపీనాథ్, సిఒ వసంత్‌రెడ్డి, విమల, మున్సిపల్ ఆర్ఒ గంగిరెడ్డి పాల్గొన్నారు.

మురుగు కాలువ నిర్మాణానికి భూమిపూజ

మైదుకూరు : స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని బైపాస్ బ్రిడ్జి నుండి మునిసిపల్ కార్యాలయం వరకు మురుగు కాలువ పనులకు బుధవారం ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి భూమి పూజ చేశారు. రూ.30 లక్షలతో నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచునూరు చంద్ర. మైదుకూరు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ అన్నపురెడ్డి శ్రీమన్నారాయణ రెడ్డి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

విద్యార్థులకు వరం విద్యా, వసతి దీవెన

- ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి చదువుకోవాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగనన్న విద్యా దీవెన, వసతి దీవెనలు అమలు చేస్తున్నారని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. స్థానిక వాగ్దేవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజిలో జగనన్న విద్యా దీవన నాలుగో విడత కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమ శాఖ ఎఎస్‌డబ్ల్యుఒ గురుప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మల్లెల ఝాన్సీరాణి మాట్లాడుతూ ఆర్థికస్థోమత లేదని ఏ విద్యార్థి ఉన్నత చదువులకు దూరం కాకూడదని జగనన్న విద్యాదీవెన పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. జగనన్న విద్యా దీవెన 4వ విడతలో ప్రొద్దుటూరు నియోజకవర్గ స్థాయిలో రూ.4.66 కోట్లు సాయం అందించిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది, వసతి గృహ అధికారులు, తల్లిదండ్రులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి

మైదుకూరు : నాలుగో విడత జగనన్న విద్యా దీవెన కార్యక్రమం పట్టణంలోని శ్రీ బాల శివ యోగేంద్ర మహారాజ్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎఎస్‌డబ్ల్యుఒ రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచునూరు చంద్ర అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశపెట్టిన విద్యా దీవెన విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజుల భారం పడకుండా ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు.

హెచ్‌ఐవి బాధితుడి పట్ల వివక్ష చూపరాదు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

హెచ్‌ఐవి సోకిన వ్యక్తిని వివక్షకు గురి చేయరాదని జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఫిక్‌బాషా పేర్కొన్నారు. స్థానిక పాతబస్టాండ్ సర్కిల్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం కళాకారులు వీధినాటక రూపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రఫిక్ బాషా మాట్లాడుతూ హెచ్‌ఐవి కేవలం నాలుగు రకాలుగా వస్తుందన్నారు. వాటి గురించి అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్‌ఐవి సోకిన ప్రతి వ్యక్తికి ఎఆర్‌టి సెంటర్‌లో ఉచితంగా మందులు ఇస్తారని వీధి నాటక రూపంలో జయశంకర్ కళా బృందం పేర్కొంది. చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ పి.నరేష్‌కుమార్, సిబ్బంది లక్ష్మీప్రసన్న, ఉమాదేవి, శేఖర్ ఐఇసి మెటీరియల్స్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం

ఖాజీపేట: ఆరోగ్యానికి పరిసరాల శుభ్రత ముఖ్యమని జిల్లా మలేరియా అధికారి మనోరమ పేర్కొన్నారు. కూనవారిపల్లె సచివాలయం పరిధిలో పత్తూరు దళితవాడ గ్రామంలో డెంగీ కేసు నమోదు కావడంతో బుధవారం ఆమెతోపాటు స్థానిక వైద్యాధికారి జి.బాలకొండ్రాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా డెంగీ సోకిన వ్యక్తి వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ అధికారి లక్షుమయ్య, మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం, ఎఎన్‌ఎం ప్రమీలారాణి, ఆశా కార్యకర్తలు మేరీ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో యుపి స్కూల్ అభివృద్ధి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేసి నూతన ఒరవడికి నాంది పలికారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 14వ వార్డు శ్రీనివాస నగర్ మున్సిపల్ యుపి ఉర్దూ స్కూల్ అభివృద్ధి పనులకు బుధవారం భూమిపూజ చేశారు. మున్సిపల్ సాధారణ నిధుల నుండి రూ.40 లక్షలతో నూతన భవన నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నాగరాజుతో కలిసి ఎమ్మెల్యే పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమం ద్వారా తమ ప్రభుత్వం 6 వేల పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందన్నారు. అదే స్ఫూర్తితో పట్టణంలో కూడా తాను ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు జిలానీ, సత్యం, మల్లి, డిఇ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

బయోమెట్రిక్ నమోదు పరిశీలన

వేముల : వేముల మండల వ్యాప్తంగా వైఎస్‌ఆర్ ఆసరా డ్వాక్రా రుణమాఫీ మూడో విడత అర్హత సాధించిన 498 స్వయం సహాయక సంఘాల సభ్యుల బయోమెట్రిక్ నమోదు విధానాన్ని డిఆర్‌డిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు వేముల, భూమయ్యగారిపల్లి, చాగలేరు, పెద్దజుటూరు గ్రామాల్లో సిసిలతో కలిసి పరిశీలించారు. ప్రతి డ్వాక్రా మహిళ బయోమెట్రిక్‌ను తప్పక నమోదు చేయాలని సూచించారు. వేరే రాష్ట్రాల్లో ఉన్న వారు కూడా గ్రూప్‌లో ఉన్న గ్రామానికి వచ్చి ఈనెల 15లోపు వందశాతం బయోమెట్రిక్ నమోదు కోసం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కమ్యూనిటీ కో- ఆర్డినేటర్ జ్యోతి, సావిత్రి, రామలింగయ్య, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు

మల్లారెడ్డి హత్య కేసులో ఏడుగురికి జీవిత ఖైదు

వేముల : మం డలంలోని భూమయ్యగారిపల్లె గ్రామానికి చెందిన మల్లుకుంట మల్లారెడ్డి(35)హత్య కేసులో ఏడుగురికి జీవిత ఖైదు విధిస్తూ కడప జిల్లా కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. కేసు వివరాలల్లోకి వెళితే.. 2010 అక్టోబర్ 18న సాయం కాలం మల్లుకుంట మల్లారెడ్డిని మల్లె గంగాధర, మల్లె రాజు, గోగుల నాగరాజు, మల్లె బుడ్డరాజు, మల్లె నడిపి గంగరాజు, మల్లె చంటి, బత్తల వెంకటరమణ హత్య చేసినట్లు కోర్టులో రుజువు కావడంతో వారికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా కోర్టు తీర్పునిచ్చింది,

'ఉక్కు' ఉద్యమానికి ఎపిజెఎంఎ మద్దతు

వేంపల్లె : ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేసేందుకు సిపిఐ రామకష్ణ చేస్తున్న ఐదు రోజుల పాదయాత్రకు ఎపి ప్రయివేట్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ మద్దతు ఇస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భూమిరెడ్డి విజయభారతి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేసే చిత్తశుద్ధి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు. గతంలో చాలా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఉక్కు ఫ్యాక్టరీ కోసం ఉద్యమాలు చేశాయని తెలిపారు. పార్టీలకతీతంగా యువత ఉద్యమానికి మద్దతు తెలపాలన్నారు.

పెరటి కోళ్లతో ఆర్థికాభివృద్ధి : ఎంపిపి

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పెరటి కోళ్లతో డ్వాక్రా కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపిపి లక్ష్మి గాయత్రి పేర్కొన్నారు. బుధవారం మహిళా శక్తి భవనంలో పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 50 పెరటి కోళ్ల యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో యూనిట్ ధర రూ.4800 అవుతుందన్నారు. పెరటి కోళ్లు పెంపకంతో మంచి జీవనోపాధి కలుగుతుందని వివరించారు. అనంతరం పెరటి కోళ్లను డ్వాక్రా సంఘం మహిళలకు ఎంపిపి, మండల స్పెషల్ ఆఫీసర్ రవీంద్రనాథ్‌రెడ్డి అందజేశారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు సులోచన, ఎపిఎం బాలస్వామి, సిసిలు, విఒఎలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.